


— ప్రతాప రవిశంకర్

ఆ రోజు టపాలో నాకో ఉత్తరం వచ్చింది. కవరు చించి మడత విప్పాను.

'తమ్ముడిని-ఆశీర్వదించి వ్రాయునది. నువ్వు ఇక్కడికి వచ్చి వెళ్ళి నెలరోజుల పయినే అయిందనుకుంటాను. ఇంతవరకూ ఏ విషయమూ రాయలేదు. నువ్వు నా మాటను నమ్మినట్లూ, వాడిమీద అనుమానాన్ని పోగొట్టుకున్నట్లూ లేవు. ఏరోజు కారోజు నీకోసం ఎదురు చూస్తున్నాను. నా మాటలు నమ్ము. వాడిగురించి నీకు తెలియనిది ఏముంది? వాడు ఎట్లా పెరిగిందీ నీకు తెలీదూ? ఈ రోజు వరకూ రాజ్యం నా ఇంటి దీపమనే అనుకుంటున్నాను. నా ఆశను అడియాస చేయకురా తమ్ముడూ! ఈ ఉత్తరం చూడగానే వెంటనే బయల్దేరి రా. నీ రాకకోసం ఎదురు చూసే-

నీ అక్కయ్య
కాంతం.

ఆ ఉత్తరాన్ని చదివిన తర్వాత

భారంగా ఓ నిట్టూర్పు విడిచాను. నాకయితే అక్కయ్య మాటల మీద కొండంత నమ్మకం వుంది. రాజ్యంని అంటే నా కూతురు స్వరాజ్యంని అక్కయ్య ఇంటి దీపం చెయ్యటానికి ఎటువంటి అభ్యంతరమూ లేదు. కాని- ఎటొచ్చీ నా అర్ధాంగే ఈ విషయం లో తన అంగీకారాన్ని తెలియ జేయడం లేదు.

మొదటినించీ అంటే స్వరాజ్యం పుట్టిన దగ్గర్నించీ అది కాంతం అక్కయ్య కోడలుగానే మా అందరిలో చలామణీ అవుతూ వచ్చింది. ఓ నెల రోజుల క్రితం వరకూ నా శ్రీమతికూడా స్వరాజ్యంని అక్కయ్య కోడలు చెయ్యడం ఇష్టమయినదే. కాని- నెల రోజుల తర్వాత నించీ, నేను వొచ్చి ఆ విషయం అర్ధాంగి చెవిన వేసిన దగ్గర్నుంచీ హఠాత్తుగా తన నిర్ణయాన్ని మార్చేసుకొని, "ఏమయినా నా కూతురు ఆ ఇంటి కోడలు కావ డాన్ని నేనొప్పుకోను" అంటోంది.

అప్పటికీ అర్ధాంగికి నా శాయ శక్తులా నచ్చ చెప్పటానికి ఎంతో ప్రయత్నం చేశాను. "చూడు రాజేశ్వరీ. ఈ లోకులు. కాకులు అదిగోపులి అంటే ఇదిగో తోక అనే రకం. ఎవరో ఏదో చెప్పారని గుడ్డిగా నమ్మి ఎన్నాళ్ళ నించో అక్కయ్య పెంచుకుంటూ వచ్చిన ఆశని, నమ్మకాన్ని నాశనం చెయ్య డం న్యాయం కాదు. దాని సంగతి నీకూ బాగానే తెలుసు. నిజంగా దానికొడుకే అందరూ అంటున్నట్టు మంచివాడు కాకుండా వున్నట్ట యితే అది ఎప్పుడో నా మొహాన చెప్పేది. కాని నేను ఈ విషయం అడిగినప్పుడు అది ఎంతగా మొత్తు కుంది? నెత్తీ నోరూ కొట్టుకొని కంట తడిపెట్టింది. అది అంతగా ఏడ్చి మరీచెప్పిన తర్వాత నమ్మ కుండా వుండ లేకపోయాను. నువ్వు 'వూఁ' అంటే దానిదగ్గరకెళ్ళి అన్ని విషయాలూ మాట్లాడి వస్తాను. ఏ మంటావ్?" అన్నాను.

అర్ధాంగి 'వూఁ' అనలేదు.

"మీరు ఎన్నయినా చెప్పండి. ఎందుకో నా మనసు వొప్పడం లేదు. ఎందుకొచ్చిన గొడవ? ఇది ఇంకోటి ఇంకోటి కాదు. పెళ్ళి. నూరేళ్ళ పంట. దాని బతుకుతో చెలగాటం దేనికి? ఎప్పట్నించో అనుకుంటున్నదే కావచ్చు. ఐతే మాత్రం? మంచికో చెడుకో మనకు ముందుగా ఓ విషయం తెలిసింది. ఇంతటితో ఈ ఆలోచనకు చుక్క పెడదాం. ఆవిషయమే వదినకు

రాయండి" అన్నది అర్ధాంగి రాజేశ్వరి.

రాజేశ్వరిని ఒప్పించకుండా ఓ నిర్ణయం తీసుకోవడం నాకు ఎంత మాత్రమూ ఇష్టంలేదు. కాంతం నా అక్కయ్యే కావచ్చు. స్వరాజ్యం మీద నాకు ఎంతటి హక్కు వున్నదో రాజేశ్వరికికూడా అంతే హక్కు వున్నది. స్వరాజ్యాన్ని ఆ ఇంటి ఇల్లాలిని చెయ్యడం తనకు ఇష్టం లేదని రాజేశ్వరి ఖచ్చితంగా చెప్పినా ఆ విషయాన్ని అక్కయ్యకు రాయడానికి నా చేతులు రాలేదు. అందుకే నెల రోజులయినా ఓ ఉత్తరం ముక్క నాసించి కాంతం అక్కయ్యకు చేరలేదు. అందుకే ఎదురు చూసిచూసి చివరకు తనే ఉత్తరం రాసింది.

నాకు ఏం చెయ్యటానికీ తోచ లేదు.

నా దృష్టిలో మా కాంతం అక్కయ్యకు సుశిష్టమయిన స్థానం వుంది. అందుకు ముఖ్యమయిన కారణం చిన్నతనం నించీ నన్ను బాగా ఆకట్టుకున్న దాని ప్రవర్తనే. దాని ప్రవర్తనను ఎంతో మంది నిరసించినా మెచ్చుకున్న వాడిని నేనొక్కడనే. మా కాంతం అక్కయ్యకు మరోపేరు మర్మం తెలియని మనిషి. నిజంగా అంతే కూడాను.

"కాంతమా? కల్లా కపటం తెలియని మనిషి. రేపు వెళ్ళిన చోట ఎట్లానెగ్గుకొస్తుందో? ఏమో?" అని దానిగురించి ఐనవాళ్ళూ కాని వాళ్ళూ ఎంతో విచారాన్ని-ఆందోళనను వ్యక్తపరిచారు. నేను బయటకు వెళ్ళబెట్టలేదు గానీ దాని భవిష్యత్తు గురించి కొంత భయపడిన మాట ఎంతయినా నిజమే.

ఎందుకంటే దానికి గుట్టూ మట్టూ అసలు తెలీదు. ఒకరకంగా ఐనదానికీ కానిదానికీ అబద్ధాలాడటం దానికి ఇష్టం లేదు. దానికి తెలిసిందల్లా తనకు తెలిసిన నిజాన్ని అడిగిన వాళ్ళందరికీ చెప్పటమే. దాని నోట్లో ఏరహస్యమూ దాగదు.

చిన్నతనంలో మా ఇంటికి ఏ పక్క భాగంలో వాళ్ళో ఏదయినా కావలసి వస్తే, అమ్మ వాళ్ళడిగిన వస్తువులేదనో, ఐపోయిందనో చెప్పేది. కాని ఇది వెంటనే వున్నదనో, ఇంకా ఐపోలేదనో చెప్పి తీసుకొచ్చి వాళ్ళకు ఇచ్చేది. వాళ్ళు అవతలకు వెళ్ళగానే అమ్మ కాంతంను చచ్చేటట్టు కొట్టేది. ఐనా దానికి తను చేసిన తప్పు ఏమిటో తెలిసేదికాదు.

వయసొచ్చిన తర్వాత కూడా అక్కయ్య ప్రవర్తనలో మార్పు

లేదు. ఒకసారి మా పిన్ని మా తమ్ముడు వాళ్ళ వూరువెడితే ఓ వంద రూపాయలు చేతికిచ్చి వాటితో మా అమ్మను వాళ్ళ పిల్లలకు బట్టలు కొని పంపించమని చెప్పింది. అమ్మ కొన్నది. ఏదో పనిమీద మా ఇంటికి వచ్చిన పిన్నికి ఆ బట్టలు ఇచ్చి అవి మొత్తం నూటఇరవై రూపాయలు ఐనా యనీ, తనవే మరో ఇరవై రూపా యలు పడ్డాయనీ చెప్పి ఇరవై తీసుకుంది. అమ్మ వంటింట్లోకి వెళ్ళగానే ఆ బట్టలు ఎనభై రూపా యలే ఐనాయని మిగిలిన ఇరవై తో తనకు ఓణీ కొన్నదనీ పిన్నికి చూపించింది కాంతం. దాని మాటలకు మా పిన్ని ముక్కుమీద వేలేసుకుంది.

మొదటినించీ దాని ప్రవర్తన వల్ల మేము ఇబ్బందులనే ఎదు ర్కొన్నా, కాంతం అక్కయ్య నిజాయితీ నాకు ఎంతగానో నచ్చింది.

తర్వాత దానికి పెళ్ళయింది. పెళ్ళయిన తర్వాత కూడా దానిలో ఏమీ మార్పు లేదనటానికి ఒక్క సంఘటన చాలు.

ఓసారి బాగా డబ్బు అవసరమై కాంతం అక్కయ్య మొగుడిని అడగటానికి వెళ్ళాను. అవసరాన్ని వివరించి రెండొందలుంటే సర్దమ న్నాను. ఆయన వెంటనేతన దగ్గిర పైసాకూడా లేదని చెప్పేశాడు. ఆ రాత్రిభోజనంచేసి ఇంటికిబయల్దేరిన నా వెనుకే రోడ్డుమీదవరకూ వచ్చిన కాంతం "ఒరేయ్ చంద్రం. ఆయన నీకు అబద్ధం చెప్పార్రా. నిన్ననే మీ పొలంచేసే రైతు నాలుగొందలు తెచ్చి ఇచ్చి వెళ్ళాడు. ఆ డబ్బుగాక ఇంట్లో ఓ వంద పైనే వుంది. ఆయన బలే పిసినారి" అన్నది. నాకు ఆశ్చర్య మైంది.

సాధారణంగా ఆడవాళ్ళు పెళ్ళయిన వెంటనే మొగుడి పక్షం వహిస్తారని నా ప్రగాఢ నమ్మకం. నా నమ్మకం మీద మంచి దెబ్బనే తీసింది కాంతం. తనో విశిష్ట మయినమనిషని రుజువు చేసుకుంది. అందుకే కాంతంమాట అంటే నాకు గురి. దాని మాట మీద నాకు అంతులేని విశ్వాసం.

అక్కయ్య దురదృష్టం కొద్దీ పెళ్ళయిన ఏడేళ్ళకే దాని మొగుడు పోయాడు. అప్పటికి దానికి ఏడేళ్ళ కొడుకు. దాని మొగుడు దానికి వదిలేసిన ఎకరం పొలంచెక్క వ్యవహారంతో పాటు దాని కొడుకు శేషగిరి చదువు సంధ్యాకూడా చూసే భారం నెత్తిన వేసుకున్నాను. ఐతే

ఆ వూరిని వదలిరానంటే రానన్నది కాంతం. అక్కడే వాళ్ళను వుంచి నేనున్న చోటునించే వస్తూపోతూ దాని కుటుంబ వ్యవహారాలను చక్కబెట్టాను.

ఇప్పుడు శేషగిరికి ఇరవై ఏళ్ళు దాటాయి. వాడు ఇంటర్ పాసవటం ఇక జరగనిపని అని నేను ఓ నిర్ణయానికి వచ్చినతర్వాత నా పరపతిని ఉపయోగించి ఆ వూళ్ళోనే ఓ బ్యాంకులో వాడికి మెసెంజర్ ఉద్యోగాన్ని ఇప్పించాను ఆరు నెల క్రితం. అప్పుడే వాడి పెళ్ళి విషయాన్ని ఎత్తింది కాంతం అక్కయ్య. నేను మాఘమాసం రాగానే మాట్లాడదామన్నాను.

నా కూతురు స్వరాజ్యం అంటే అక్కయ్యకు పంచ ప్రాణాలు. స్వ రా జ్యం అందమయినది. బంగారు బొమ్మ. దానికి తన రూపమే వచ్చిందని అక్కయ్య నమ్మకం. అది పుట్టిన మరుక్షణం వించే 'నా కోడలు పుట్టింది' అంటూ బంధువుల్లో టముకు వేసింది. ఆ టముకు మా అందరికీ ఇష్టమయినదే.

స్వరాజ్యం టెన్త్‌క్లాసు పాసయ్యింది ఇంటర్‌లో చేరింది. అది పెద్దమనిషై ఏడాది పైగానే అయింది. దానికి శేషగిరిని చేసుకోవడం గురించి ఎలాంటి అభిప్రాయమూ లేదు.

వాడికి ఎల్లాగూ ఉద్యోగం కూడా వచ్చింది కాబట్టి దాన్ని తన ఇంటికి తీసుకెళ్ళడానికి అక్కయ్య కూడా తహతహ లాడుతుంది. కాబట్టి ఆ పెళ్ళి విషయమేదో మాట్లాడదామని నెల్లాళ్ళ క్రితం దాని వూరికి వెళ్ళాను.

అక్కడ మా బంధువే ఒకాయన-వరసకు నాకు బాబాయి అవుతాడు-నేను ఎందుకు వచ్చిందీ తెలుసు కొని, "ఒరేయ్ చంద్రం! ఇలా అంటున్నానని కోపగించుకోకు. వాడు విన్నటి శేషుగాడు కాదు. ఉద్యోగం వచ్చిన తర్వాత బాగానే చెడిపోయాడు. తాగుడు మొదలు పెట్టాడు. ఇంకా చెడు తిరుగుళ్ళు కూడా తిరుగుతున్నాడని విన్నాను. ఏమయినా వాడికి నీ కూతుర్నివ్వడం నాకు సుతరామూ ఇష్టంలేదు సుమా" అన్నాడు.

విస్తుబోయాను ఆయన మాటలు విని. శేషగిరి చెడిపోయాడా అనుకున్నాను.

ఇందులో నిజానిజాలు కాంతం అక్కయ్యనే అడిగి తెలుసుకుందామని వెళ్ళాను. దానితో శేషగిరి తాగుడు గురించి ప్రస్తావించాను. అంతే. అది నెత్తీనోరు బాదు

కొంటూ "అయ్యో. ఎవడురా నీకు నా బిడ్డగురించి అలా చెప్పింది? శేషగాడు ఎలాంటి వాడో నీకు తెలీదా? వాడు బతుకు వాడు బతకటం చూసి కళ్ళలో నిప్పులు పోసుకున్న వాళ్ళు ఎవరో నీకు అట్లా చెప్పి వుంటారు. అన్నీ తెలిసిన నువ్వే ఆ మాటలు నమ్ము తున్నావా? నన్ను నమ్ము. వాడు ఏ పాపమూ ఎరుగడు" అని కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

అక్కయ్య అలా మాట్లాడే సరికి నాకు బాగానే వూరటకలిగింది. తర్వాత శేషగిరి వచ్చాడు. వాడితో మాట్లాడాను. మామూలుగానే ఇది వరకటిలాగానే మాట్లాడాడు. వాడిలో నాకు మార్పేమీ కనిపించ లేదు.

ఇంటికి వెళ్ళి రాజేశ్వరితో కూడా మాట్లాడి మళ్ళీ వస్తానని చెప్పి వచ్చేశాను. రాజేశ్వరితో చెబితే వద్దంటే వద్దన్నది. స్వరాజ్యాన్ని అడిగితే "మీ ఇష్టం నాన్నా" అన్నది.

అక్కయ్యనించి వచ్చిన ఆ ఉత్తరాన్ని రాజేశ్వరికి చూపించాను. "దీనికి ఆలోచించేది ఏముంది? మనకు ఇష్టంలేదని రాసెయ్యండి" అన్నది కాని నేను నాప్రయత్నాలను మానెయ్యలేదు.

"నువ్వో కొంచెం ఆలోచించు రాజేశ్వరీ! అక్కయ్య గుణం నీకు తెలియనిది కాదు. మొదటినించీ స్వరాజ్యం మీద ఎన్ని ఆశలు పెట్టుకొన్నదో నీకు తెలుసు. ఈ రోజు శేషు గురించి చెడుగా చెప్పిన బాబాయికి కూడా ఎవరో అబద్ధాలు చెప్పివుండవచ్చు. లేదా అసూయతో బాబాయే అబద్ధాలు చెప్పివుండొచ్చు. ఎవరో మాటలు నమ్మి అక్కయ్యను బాధ పెడితే నిజంగా వాడు ఏ పాపమూ ఎరుగని వాడయితే మనం తర్వాత ఎంతగా బాధపడాలి? నా మాట నమ్ము. మొదటినించీ శేషు నెమ్మదస్తుడు. కేవలం ఈరోజు ఉద్యోగం రాగానే వున్నట్టుండి తాగుబోతుగా మారా డంటే నాకు నమ్మశక్యంగా లేదు. నువ్వెలా నమ్ముతున్నావో" అంటూ చాలా చెప్పాను.

చివరికి ఎల్లాగో రాజేశ్వరి ఒప్పుకుంది. ఏమయినా ఈ విషయం గురించి మరోసారి ఆరా తీయమన్నది. సరేనన్నాను. ఇస్తున్నది అక్కయ్య కొడుక్కే. అయినా ఇది నా కూతురి భవిష్యత్తుకు సంబంధించిన విషయం.

ఉత్తరం అందిన మరురోజునే వెళ్ళడానికి ప్రయత్నించానుగానీ సెలవు దొరకని కారణంగా వెళ్ళ

లేకపోయేను. ఆ మరురోజు సాయంత్రం బయలేరాను. అక్కయ్య ఇంటి దగ్గరకు చేరుకునే సరికి రాత్రి తొమ్మిది గంట లయింది.

వెళ్ళేసరికి తలుపులు మూసి వున్నాయి. మూసివున్న తలుపుల మీద తట్టబోయి ఆగిపోయేను. లోపల్నుంచి మాటలు వినిపిస్తున్నాయి పెద్దగానే. అది శేషుగాడి గొంతు.

"నిన్ను ఛంపేస్తానేవ్. వారానికి రొండ్రోజులు తాగితే ఏమయ్యింది? సంపాయించుకుంటున్నాను. తప్పా? చెంద్రం మామయ్య సొరాజ్యాన్నివ్వకపోతే నాకు పెళ్ళికాదా? కో అంటే కోటి మంది...."

వినలేక పోయాను. కొరడాలతో మొహం మీద ఆపకుండా కొడుతున్నట్లనిపించింది. ఇది శేషుగాడు అంటున్న మాటలకు కాదు. నా దృష్టి లో విశిష్టమయిన స్థానాన్ని ఆక్రమించుకున్న కాంతం అక్కయ్య తన కొడుకు గురించిన దారుణమయిన నిజాన్ని దాచి నాకు అబద్ధం చెప్పినందుకు.

ఇక అక్కడ నిలబడలేక వెనక్కు మళ్ళాను. కాంతం అక్కయ్య గురించిన నా అంచనా పూర్తిగా తల క్రిందులైంది. ఇప్పుడు నా దృష్టిలో కాంతం అక్కయ్య మర్మం తెలియని మనిషి కాదు-లోకం తెలిసిన మనిషి. ❋

---


విజయ

# చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 36 రూ॥ |
| అర్ధసంవత్సర చందా | 18 రూ॥ |
| విడి ప్రతి | 3 రూ |